అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- ధర్నాలో అంగన్వాడీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అంగన్వాడీ న్యాయపరమైన డిమాండ్ల కోసం విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు బయలుదేరిన అంగన్వాడీలను అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి, పి.జాన్‌ప్రసాద్, కోడూరు ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.శ్రీరమాదేవి సమస్యలపై తహశీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, శిరీష లీలావతి, ఈశ్వరమ్మ, వెన్నెల, మణెమ్మ, వాణి, మైథిలి, రెడ్డమ్మ, గాయత్రి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్నఅంగన్వాడీలు

పేదింట ఉడకని కంది పప్పు!

బహిరంగ మార్కెట్‌లో కంది ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఈ నెలా కందిపప్పు అందని ద్రాక్షగానే మిగిలింది. పేదింట పప్పు ఉడకడం లేదు. తక్కువ ధరకే చౌక ధరల దుకాణాల్లో అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు మార్కెట్లో కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీస్తున్నా అదుపు చేసే వ్యవస్థ లేకపోవడంతో కలవరపడుతున్నారు. ఎందుకా ఈ పరుగు అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తున్నా పాలకుల్లో కాసింతైనా చనలం లేదు.

చౌకదుకాణాల్లో ఆగిన పంపిణీ

రెండు నెలలుగా విడుదల కానివైనం

అందని ద్రాక్షలా కందిపప్పు

బయటి మార్కెట్లో రూ.150కి పైగా పలుకుతున్న ధర

చౌకదుకాణాల కందిపప్పుకు పెరిగిన డిమాండ్

సరకుల కోతతో కార్డుదారుల ఆక్రోశం

ప్రజాశక్తి-చాపాడు/రాయచోటి

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 2,362 చౌక ధరల దుకాణాలున్నాయి. ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి ఎండియు వాహనాలు 676 ఏర్పాటు చేశారు. ఇవి చాలా చోట్ల కదలడం లేదు. పేదలకు చౌక దుకాణాల్లో కంది పప్పు కరువైంది. ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి ఇప్పటి వరకు విడుదల కాలేదు. బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 1,239 రేషన్ షాపుల పరిధిలో 5,78,777 కార్డుదారులు, అన్నమయ్య జిల్లాలో 1,123 రేషన్ షాపుల పరిధిలో 4,98,092 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా తెల్లరేషన్ కార్డులపై బియ్యం ఉచితంగాను, అర కిలో పంచదార రూ.17, కిలో కందిపప్పు రూ.70 చొప్పున సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సంగతి తెలిసందే. ఇవన్నీ ప్రతి నెలా 1వ తేదీ నాటికే సివిల్ సప్లైరు గోడౌన్లకు చేరేవి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా గ్రామాలకు సరుకులు చేరేవి. వ్యానుల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న విషయం విధితమే. కంది పప్పు విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా కొంత శాతం కోత పెడుతోంది. ఫిబ్రవరి, మార్చి నెలలో పూర్తిగా కార్డుదారులకు కంది పప్పు సరఫరా కాలేదు. మార్చి నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు ఇప్పటికీ కంది పప్పు చేరలేదు. ఏకంగా కందిపప్పు విడుదల చేయకపోవడంతో పేద, నిరుపేదలు నెలలో ఒక్కపూట కూడా పప్పు అన్నం తినే పరిస్థితి లేదు. కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ.140 నుంచి రూ.160 వరకు పలుకుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు నెలలుగా ఇవ్వలేదని కార్డుదారులు తెలుపుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ నెల కందిపప్పు ఇవ్వలేదన్న విషయాన్ని కార్డుదారులంతా చెబుతున్నారు. గత నెలలో బియ్యం సరఫరాలో కోత విధించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో తిరిగి పూర్తి స్థాయిలో పంపిణీ చేశారు. సరుకులు సరిగా ఇవ్వడం లేదన్న ప్రజల వాదనకు తగ్గట్టుగానే రేషన్ సరుకులైన బియ్యం, పంచదార, కందిపప్పు పక్కదారి పడుతున్నాయి. ఉమ్మడి కడప జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక మండలంలో రేషన్ సరుకులు పట్టుబడుతున్నాయి. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండగలకు ప్రత్యేకమైన సరుకులు అందించేవారు. డిసెంబర్, జనవరి నెలల్లో జరిగిన ఈ పండగలకు అటువంటి సరుకులు అందుతాయని భావించినప్పటికీ ఆచరణలో అందలేదు. ప్రస్తుతం రంజాన్ నెలలో కూడా అలాంటి పరిస్థితి కనిపించడం లేదు.ఈసారి నెలవారి ఇచ్చే సరుకుల్లోనూ కందిపప్పు కోత పెట్టడంతో తెల్లరేషన్‌కార్డులు విలవిలాడిపోతున్నారు. ఇలా చౌక ధరల దుకాణాల్లో సరుకులు తగ్గించి, ఇచ్చిన వాటిలో కోత విధించడం, ఈనెల ఏకంగా కందిపప్పు సరఫరాకు ఎగనామం పెట్టడంతో పేదలకు ఆర్థిక భారంగా పరిణమించింది.



రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు

రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరిలో మాత్రం పంపిణీ చేశారు. పిభ్రవరిలో పంపిణీ చేయలేదు. మార్చి నెలకు సంబంధించిన కందిపప్పు ఇంకా రాలేదని రేషన్ విక్రయించే సిబ్బంది చెబుతున్నారు. పప్పు ధర కూడా పెరిగిపోయింది. రూ.140 పెట్టి కొనుగోలు చేయాలంటే ఇబ్బందికరంగా ఉంది. పేదలకు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది.

- నాగయ్య, దినసరి కూలీ, గడ్డమాలవాడ, మైదుకూరు.

ఆగి ఉన్న డిఎంయు వాహనం

నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టాలి

ప్రభుత్వం నిత్యావసర సరుకులను కోత విధించకుండా సరఫరా చేపట్టాలి బియ్యం మాత్రం ఉచితంగా పంపిణీ చేస్తూ చక్కర కందిపప్పులో కోత విధిస్తున్నారు. కందిపప్పు రెండు నెలలుగా ఇవ్వడం లేదు మార్కెట్లో కందిపప్పు ధర ఆకాశాన్ని అంటుతున్నది ప్రభుత్వం ప్రతినెల రేషన్ సరుకులను పంపిణీ చేపట్టాలి.

- లక్ష్మణ్ రావు, వెంకటాపురం, చాపాడు.

కంది పప్పు ఇవ్వాలి

ప్రభుత్వం పంపించేస్తున్నా రేషన్ బియ్యంతో పాటు గతంలో కంది బేడలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కంది బేడలు ఇవ్వడం లేదు. రేషన్ బియ్యం బండి వద్ద వారిని అడిగితే తమకు తెలియదు అని వారు సమాధానం చెబుతున్నారు. రేషన్‌లో ఇచ్చే నిత్యవసర సరుకులను తోనే జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం వెంటనే రేషన్ బియ్యంతో పాటు కంది బేడలు పంపిణీ చేయాలి.

- ఎ.రెడ్డయ్య ఎగువ అబ్బవరం, రాయచోటి.

బియ్యం ఇచ్చారు..కందిపప్పు ఇవ్వలేదు

ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తూ మంచి పని చేస్తుంది. గతంలో బియ్యంతో పాటు చక్కెర, కంది బేడలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతున్న నేటికీ నిత్యావసరాలతో పాటు కందిబేడలు మాత్రం పేదలకు అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు బియ్యంతో పాటు కంది బేడలను ప్రతినెల ఇవ్వాలి.

- డి.శంకరమ్మ, రాయచోటి.

అసంపూర్తి గృహ నిర్మాణాలకు

అదనపు ఆర్థిక సాయం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

2019-24 మధ్య కాలంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు గృహాలు మంజూరై ఇంకను వివిధ దశలలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయడానికి అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు అందాయని అన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇల్లు' ఏర్పరచాలనే దృఢ నిశ్చయంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. పిఎంఎవై 1.0లో ఇల్లు మంజూరై ఇంకనూ వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న గృహాలకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. జిల్లాలో దాదాపు 25 వేల మంది లబ్ధిదారుల గృహాలు వివిధ దశలలో అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. నిర్మాణం పూర్తికి ఎస్‌సి, బిసిలకు రూ 50వేలు, ఎస్‌టిలకు రూ. 75 వేలు చొప్పున అదనంగా ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఏప్రిల్ 20 లోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తెలిపారు. నిర్మాణం పూర్తి చేసుకునే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారని చెప్పారు. ఈ మేరకు లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ శివయ్యను ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనిటీస్, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడంలో నిధుల మంజూరు కొరకు మధ్యవర్తులు, ఇతరుల మోసపూరిత మాటలు నమ్మరాదని, సంబంధిత గృహ నిర్మాణ సిబ్బంది, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లను సంప్రదించాలని తెలిపారు. లబ్ధిదారులకు ఏవైనా సందేహాలు ఉంటే గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ మొబైల్ 7093931084 నెంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చుని సూచించారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ధి సదవకాశాన్ని వినియోగించుకొని సొంతింటి కల సాకారం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి ప్రజ్ఞా వికాసం పరీక్ష పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. సోమవారం పట్టణంలోని విజయ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ సేతు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞ వికాస్ పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన రెడ్డి సుదీప్, షన్ముఖ ప్రియ, మోచినారెడ్డి, జ్ఞాన సాయి, సంజనా ప్రియలకు బహుమతులు అందించారు. పట్టణంలోని ప్రతి ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ స్కూలు నుంచి మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. భవిష్యత్తులో విద్యార్థులందరూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యసాధన వైపు ముందుకు వెళ్లాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ సర్వేపల్లి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు జయబాబు, సుల్తాన్ పాల్గొన్నారు.

సంఘమిత్ర చేతివాటం..రూ.10 లక్షలు స్వాహా

-పోలీసులను ఆశ్రయించిన ఎపిఎం మురళి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : మహిళా సమాఖ్యలోని సంఘ సభ్యుల అభ్యున్నతికి అండగా నిలవాల్సిన సంఘమిత్ర తన పరిధిలో ఉన్న ఐదు సంఘాల నుంచి సుమారు రూ.10 లక్షలకు పైగా నిధులను స్వాహా చేసి తన చేతివాటాన్ని ప్రదర్శించింది. దీనిపై స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు ఎపిఎం మురళి తెలిపారు. ఎపిఎం వివరాల మేరకు... అగ్రహారం పంచాయతీ, నవోదయం గ్రామ సమాఖ్యలో గతంలో సంఘమిత్రగా పనిచేసిన శారద సమాఖ్యలోని 5 సంఘాల నుంచి నిధులను స్వలాభం కోసం స్వాహా చేసి, సంఘాల నిధుల దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. దీనిపై సంఘాలలోని సభ్యులు నిమ్మనపల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఫిర్యాదు చేశారన్నారు. సభ్యుల ఫిర్యాదు మేరకు 04-09-2024వ తేదీన క్షేత్రస్థాయిలో సభ్యులను విచారించి, నవోదయం గ్రామ సమాఖ్య సంఘాలకు సంబంధించిన ఉన్నతి, స్త్రీనిధి కాంపోనెంట్ పరిధిలో అప్పులు తీసుకున్న పుస్తకాలను ఆడిట్ చేయగా సుమారు రూ.10 లక్షలకుపైగా నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు బయటపడడం జరిగిందన్నారు. 04-09-2024వ తేదీన సుమారు రూ.2 లక్షలను తిరిగి చెల్లించిందన్నారు. మిగతా మొత్తాన్ని చెల్లించడానికి నెల రోజులు సమయం కావాలని ఆమె విన్నవించగా ఎపిఎం నెల రోజులు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఆమె కోరిన గడువు పూర్తయి ఆరు నెలలు కావస్తున్న దుర్వినియోగం సొమ్మును చెల్లించకపోగా, నిధులను చెల్లించాలని కోరుతున్న సంఘ సభ్యుల పైన, మహిళా సమాఖ్య సిబ్బంది పైన ఆరోపణలు చేస్తోందని అన్నారు. సంఘమిత్ర చేసిన నిధుల దుర్వినియోగం వల్ల సంఘాల పైన ఉన్న బకాయిలు పెరిగిన కారణంగా మండలంలోని ఇతర సంఘాలకు రుణాలు రాకుండా అవరోధం ఏర్పడిందన్నారు. దీనివలన మిగతా సంఘాలలోని సభ్యులు వారి అవసరాల కోసం రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఎపిఎం మురళి, మండల మహిళా సమాఖ్యలోని సిబ్బందితో కలిసి సంఘమిత్ర నుంచి దుర్వినియోగ నిధులను రాబట్టి న్యాయం చేయాలని సోమవారం పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించగా, ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం సంఘమిత్రపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ప్రభుత్వ భూముల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి-పీలేరు : మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురై, చేతులు మారాయన్న ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే పనులు ఆరవ రోజుకు చేరాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న ప్రభుత్వ భూముల గుర్తింపు సర్వే పనులు సోమవారం పీలేరు మండలంలోని, గూడరేవుపల్లి పంచాయతీ పరిధిలో జరిగాయి. గత ప్రభుత్వంలో పట్టణ పరిసరాల్లోని ఆరు పంచాయతీల్లో సుమారు 600 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి కొందరు బినామీల చేతుల్లో పడి, ప్లాట్ల రూపంలో అక్రమ వ్యాపారం సాగిందన్న ఆరోపణలపై ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అసెంబ్లీలో సమస్యను లేవనెత్తారు. స్పందించిన ముఖ్యమంత్రి, రెవెన్యూ కమిషనర్ సిసోడియాకు విచారణకు సూచించడంతో స్పందించిన కలెక్టర్ సర్వేకు ఆదేశించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- నిరసనలో ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్న రైతులకిస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎక్కడ చంద్రబాబు అంటూ ఎపి రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. జిల్లాలో రైతులను ఆదుకోవాలని, సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరుతూ జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.వెంకటరమణారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్ బాబు మాట్లాడుతూ రైతులకిచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోని మూలంగా రైతన్న అప్పుల ఊబిలో చిక్కు పోయాడని వాపోయారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం తీసుకు రావాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన డిజిటల్ అగ్రిమిషన్ నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్స్ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సాయం వెంటనే రూ.20 వేలు అందించాలని, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాతావరణ పరిస్థితుల వల్ల నష్టపోతున్న అరటి, మామిడి, బొప్పాయి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు ఇచ్చి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చెయ్యాలని, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి రైతు కుటుంబం పై సుమారు రెండు లక్షలా 45 వేల రుణ భారం పడిందని వివరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు వేమనారాయణరెడ్డి, పి.శ్రీనివాసులు, రామాంజులు, రమణప్ప, రత్నమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

పరీక్ష కేంద్రాలను మార్పులు చేసిన వారిపై చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు వ్యతిరేకంగా పరీక్ష కేంద్రాలను మార్పులు చేర్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న క్రమంలో మదనపల్లి పట్టణంలోని జ్ఞానాంబిక జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలు ఒకేచోట నిర్వహిస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఒకే చోట గత ఏడేళ్లుగా పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నారని అన్నారు. జ్ఞానాంబిక జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉందంటూ విద్యార్థులకు ఇచ్చిన హాల్ టికెట్లు పొందుపరచడం జరిగిందని అన్నారు. అయితే జ్ఞానాంబిక జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారని ఇది పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు భిన్నంగా ఉందన్నారు. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భారతీయ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు కూడా లేవని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల వరకు ఎటువంటి జిరాక్స్ షాపులు ఉండకూడదనే నిబంధనను తుంగలో తొక్కారని అన్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలం చెందారని అన్నారు. ఇప్పటికైనా అధి కారులు తనిఖీలు చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గురునాథ్, బన్నీ, హేమంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన సర్వేయర్

పాస్‌బుక్స్ రద్దు చేయాలని గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికారాన్ని అడ్డం పెట్టుకొని సర్వేయర్ గ్రామ అవసరాలకు ఏర్పాటు చేసిన గ్రామ కంఠం భూమిని తమతల్లి పేరిట దోచుకున్నాడని నిరసిస్తూ ఆ గ్రామ ప్రజలు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామ అవసరాలకు ఏర్పాటుచేసిన ఆ భూమిని గ్రామానికి వదిలేయాలని, అక్రమాలకు పాల్పడిన సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని, పాస్ బుక్కులను రద్దు చేయాలని సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా గండువారుపల్లి గ్రామస్థులు రాజేంద్రమోహన్, గురుప్రసాద్, రమణ మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం, గుమ్మసముద్రం పంచాయతీ, గండువారిపల్లె లో సర్వే నెంబర్ 271 లో 4.6 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమి పూర్వం నుంచి గ్రామస్థుల అవసరాలకు ఉపయోగపడుతోందని, ఇందులోనాలుగు గుళ్లు ఉన్నాయి. 20 చింతమానులు, 20 సమాధులు ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని పశువులకు ఇక్కడే మేత దొరుకుతుందని తెఇపారు. ఇలా ఎన్నో రకాలుగా గ్రామస్థులకు ఈ గ్రామ కంఠం భూమి ఆసరాగా ఉంటోందని అన్నారు. ఇక్కడే సర్వేయర్ గా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్ర 2023లో వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో చక్రం తిప్పాడని అన్నారు. గ్రామ కంఠం భూమిని మూడో కంటికి తెలియకుండా తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని తన తల్లి పద్మావతమ్మ పేరుమీద పాస్ బుక్కులు సిద్ధం చేసి ఆన్‌లైన్ చేయించుకున్నాడని ఆరోపించారు. సర్వే నెంబర్ 285 లోని మరో ఎకరం ప్రభుత్వ భూమిని తన అవ్వ పాపులమ్మ పేర పాస్ బుక్కులు తయారు చేసుకుని ఆన్‌లైన్ చేయించుకున్నాడని అన్నారు. అ భూమిలో మంచినీటి బోరు ఉందని తెలిపారు. ఇలా పూర్వీకుల నుండి గ్రామస్థులకు ఉపయోగపడుతున్న ఐదెకరాల భూమిని సర్వేయర్ రాజేంద్ర తన తల్లి, అవ్వ పేర్ల మీద అక్రమంగా పాసుబుక్కులు తయారు చేసుకున్నాడని ఆరోపించారు. వెంటనే విచారణ చేసి అక్రమంగా తయారు చేసుకున్న పాసుబుక్కులను రద్దు చేసి, గ్రామ అవసరాలకు ఉపయోగ పడుతున్న ప్రభుత్వ భూమిని గ్రామకంఠం కిందే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన సర్వేయర్ రాజేంద్రను సస్పెండ్ చేయాలని విన్నవించారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గండువారిపల్లె చంద్రమోహన్, గురుప్రసాద్‌నాయుడు, బయప్ప, రామకృష్ణ, నరేంద్ర, నరేష్, కృష్ణమూర్తి, మనోహర్, నిర్మల, రమణ, సుదర్శన్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జెసి

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి :జెసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమ స్యలను బాధ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సంద ర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించా లన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికా రులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖా స్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని తెలిపారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు రోల్ మోడల్‌గా ఎదగాలి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థులు చిన్ననాటి నుండే రోల్ మోడల్ గా ఎదగాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాల నందు సోమవారం ఉదయం పీఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చిన 250 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పెట్రోల్ లీడర్ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ సేవాభావం పెంపొందుతుందని అన్నారు. ఐదు రోజులపాటు సాగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కౌట్ నందు చేరి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. అనంతరం అర్చన కళాశాల కరస్పాండెంట్ మదనమోహన్ రెడ్డి మాట్లాడుతూ స్కౌటింగ్ ద్వారా విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం అలబడుతుందన్నారు. ప్రతి విద్యార్థి స్కౌటింగ్‌లో పాల్గొని సమాజానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏ ఎస్ ఓ సి లక్ష్మీకర్, హెచ్ డబ్ల్యు బి నిర్మల, స్కౌట్ మాస్టర్ లు నాగరాజ, గైడ్ కెప్టెన్లు గోవిందమ్మ, స్వర్ణలత, వాణిశ్రీ ,రాధ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాస్టర్ కిడ్స్ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని మాస్టర్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎఐఎంఎస్ ఒలంపియాడ్ అకాడమీ సంస్థ గత నెల 16న నేషనల్ లెవల్ పోటీలు నిర్వహించినట్లు మాస్టర్ కిడ్స్ స్కూల్ వ్యవస్థపకులు ఖాదర్‌బాషాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి, అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. ర్యాంకులు సాధించిన వారిలో 2వ తరగతి చదువుతున్న అయేషా సిధిక నేషనల్ లేవెల్‌లో 2వ ర్యాంకు, 3వ తరగతి చదువుతున్న మధిహ మెహూరుఫ్ జోనల్ లెవెల్ లో 6న ర్యాంకు, 5వ తరగతి చదువుతున్న పియండి. ధనిష్ ఖాన్ జోనల్ లెవెల్ లో ఫ్లే ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన మా విద్యార్థులకు ఆదివారం హైదరాబాద్ లోని ప్రముఖ రవింద్ర భారతి ఆడిటోరియంలో ప్రతభ పురస్కారాలను ప్రముఖ రచయిత, గాయకులు కడియాల ప్రభాకరరావు, ఎఐయంఎస్ ఒలంపియాడ్ అకాడమీ సంస్థ వ్యవస్థాపకులు యండి.కలీముల్లాఖాన్ ప్రదానం చేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిం చారు. ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని ఆకాంక్షించారు.

పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను సరిచూస్తున్న రూట్ ఆఫీసర్లు

పోలీసుస్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి-నందలూరు

కనీసం ఐదు ప్రత్యేక సాధారణ కోచ్‌లు ఉండాలని తెలిపారు. ఈ నెల 17వ తేది నుంచి 31 వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సెట్ 1 ప్రశ్న పత్రాలు సోమవారం నందలూరు పోలీసస్టేషన్‌కు చేరడంతో సంబంధిత అధికారులు వాటిని సరిచూసుకుని భద్రపరచినట్లు రూట్ ఆఫీసర్లు రఘునాథరాజు, ఆనంతకృష్ణ, కష్టోడియన్లు షేక్‌రౌఫ్‌బాషా, దండు సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం సెట్ 2 ప్రశ్న పత్రాలు వస్తాయని కావున నందలూరు మండలంలోని 5 పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు అధికారులు పోలీసు స్టేషన్ దగ్గరకు రావాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్లు ఎం.శివరామ్, ప్రసాద్, సుచరిత, మాధవీలత, కె.బబిత, డిపార్ట్ మెంటు అధికారులు వెంకటయ్య స్వర్ణలత పాల్గొన్నారు.

12న రైల్వేకోడూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంత గాని నరసింహాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం మహర్షి అభ్యుదయ సేవా సంస్థ వారి సహకారంతో నిర్వహి స్తున్నామని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బి ఫార్మసీ, డి.ఫార్మసీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు 18 నుంచి 30 సంవత్సరాల వయసులోపు వారు ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చునని ఆయన తెలిపారు.

రైల్వే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి సోమవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీలోని రాజ్యసభలో మాట్లాడుతూ నందలూరులో రైల్వే శాఖకు సంబంధించి, లోకో షెడ్‌తో ముఖ్యమైన ఇంటర్‌ఛేంజ్ జంక్షన్‌గా పనిచేసిన వందల ఎకరాల ఖాళీ భూమిని సముచితమైన రీతిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెయ్యేరుకు సంబంధించిన స్వచ్ఛమైన నీటితోపాటు పలు రకాల మౌలిక వసతులు ఉన్నాయని తెలిపారు. రైళ్ల, స్టేషన్‌లలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిశుభ్రత గురించి ప్రయాణికుల ఫిర్యాదులు చాలా వరకు పెరిగాయని, సాధారణ ప్రజలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అన్నారు. ప్రీమియం రైళ్లతో సహా ప్రతి రైలుకు ఆమ్ జనతా కోసం

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-వీరబల్లి

స్థానిక మండల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి నెల 10న వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు 150 మంది గర్భిణీ మహిళలకు పౌష్టిక ఆహార భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సతీమణి గాలివీటి పద్మజ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు మధ్యాహ్న భోజనం కోసం ఇబ్బంది పడకూడదనే మూడేళ్ల నుంచి ప్రతి నెలా 10న ప్రతి మహిళ పౌష్టిక ఆహారం అందిస్తున్నామని తెలిపారు కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మనీషా, డాక్టర్ జియా ఉల్లా, గర్భిణులు, ఆస్పత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పీలేరు

కుట్టు శిక్షణపై ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీలేరు ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. మహిళల్లో ఆర్థిక స్వాలంబన సాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ క్రమంలో బిసి, ఇడబ్ల్యుఎస్, కాపు కమ్యూనిటీలకు చెందిన 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు మహిళలకు 45, 60, 90 రోజులు వంతున మూడు రకాలుగా శిక్షణ ఇచ్చి, ఆపై వారు పొందిన శిక్షణలో ఒకరోజు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం అర్హులైన వారికి కుట్టుమిషన్లను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబరుతో ఒబిఎంఎంఎస్ పద్ధతిలో అన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మిగిలిన సమాచారం కోసం మీ గ్రామ పరిధిలోని సచివాలయ సహాయ సంక్షేమ అధికారిని సంప్రదించాలని తెలిపారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం ప్రజలతో కిటకిటలాడింది. మాఘమాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండపై జనాలు పోటెత్తారు. పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. మల్లయ్య కొండకు దిగువనన్న వెలుగు మల్లమ్మ అమ్మవారిని పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల కు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ ఇఒమునిరాజు, కొండకిట్టాలు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఏకాగ్రతతో పరీక్షలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రతతో రాయడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఇరిగేషన్ ఎస్ఇ విటల్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ డాక్టర్ ఎన్ సేతు ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన పదవ తరగతి గ్రాడ్యుయేషన్, ఫేర్వెల్ కార్యక్రమానికి ఇరిగేషన్ ఎస్ఇ విటల్ ప్రసాద్, డిఇఇ ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పదో విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు ఫేర్వెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విటల్ ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది పాటు చదివిన విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని, తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలను క్షుణ్ణంగా చదివి పరీక్షలు రాయాలన్నారు. ముఖ్యంగా టివి, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకో వలన్నారు. ప్రశ్నా పత్రాన్ని క్షుణ్ణంగా చదివి సరైన సమాధానాలను రాయడం వల్ల మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు. అనంతరం మోటి వేషన్ స్పీకర్ రామ్మూర్తి మాట్లాడుతూ మానసికంగా, ప్రశాం తంగా ఉండా లన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ కోటిరెండ్డి, నరసింహారెడ్డి, అజ్మతుల్లాఖాన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అందజేస్తున్న అతిథులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఒ నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు, ప్రతినిధులు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. వీరబల్లి ఎంపిటిసి పెద్ద వీటి మల్లీశ్వరి మాట్లాడుతూ బొంగావాండ్లపల్లి దళితవాడలో సంవత్సరం నుంచి తాగినీటి సమస్య ఉందని, ఎప్పుడు తీరుస్తారంటూ ప్రశ్నించారు. రైతులు పొలంలో నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. రైతు పొలానికి నీళ్ల తక్కువ వస్తాయని నీళ్ల ఇవడం లేదని తెలిపారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.250 చందా వేసుకుని ఒక నెల ట్యాంకర్లతో నీళ్ల తెచ్చు కున్నామని తెలిపారు. ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరింది. మట్లి సర్పంచ్ నాగార్జునచారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఉచిత గ్యాస్, వికలాంగులకు పింఛన్ పెంపు, అభివృద్ధిపథంలో నడిపిస్తుందన్నారు. వైసిపి పాలనలో సిమెంటు రోడ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కూటమి పాలనతో గ్రామాల్లో రూ.20 లక్షల నుంచి 30 లక్షల వరకు సిమెంట్ రోడ్డు వేశారన్నారు. మండలం నుంచి రాత్రనక, పగలనక వేల ఇసుక ట్రాక్టర్లు బెంగళూరుకు తరలిపోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వివిధ ఆయా శాఖాధికారులు ఈ మూడు నెలల కాలంలో వారి వారి శాఖల పరంగా జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ మనీషా, డిటి వెంకట నారాయణరావు, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఇర్ఫాన్, ఎలక్ట్రికల్ ఎఇ కిషోర్, ఎపిఎం ఖాదరవల్లి, ఉపాధి ఇసి ఆంజనేయులు, అగ్రికల్చర్ ఎఒ స్వాతి, హార్టికల్చర్ ఎఒవనిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితమ్మ, బిసి హాస్టల్ వార్డెన్ వెంకట సుబ్బరాజు, ఎస్ఐ మోహన్ నాయక్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

అవగాహనతోనే క్షయ రహిత సమాజం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-కలికిరి

క్షయ రహిత సమాజ నిర్మాణం అవగాహనతోనే సాధ్యమని మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి వారి ఆదేసాను సారం టి వ్యాధి అవగాహనా మాసోత్సవాలలో భాగంగా మండలం కేంద్రం లోని సోసియల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, రోజు రాత్రి పూట జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, గస, ఆయాసం, నీరసం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం, గళ్ళ పడుట, రక్తం చుక్కలు గళ్ళ లో కనిపించడం వంటి లక్షణాలు ఉంటే టిబి వ్యాధి అని అనుమానించి ఆశాకార్యకర్త ను సంప్రదించి ప్రభుత్వ అస్పత్రి లో గళ్ళ పరీక్షలు చేయించాలని తెలిపారు. టిబి ఒకరి నుంచి మరొకరికి నోటి తుంపరలు ద్వారా వ్యాపిస్తుందని, ఒకవేళ వ్యాధి ఉందని నిర్ధారణ ఐతే ఆరు నెలలు మందులు డాట్స్ ఆధ్వర్యంలో తినాలని సూచించారు. చికిత్స కాలంలో రోగికి ప్రధానమంత్రి పోషణ అభియాన్ పథకం కింద వెయ్యి రూపాయలు వారి ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అంజలి, వైస్ ప్రిన్సిపల్ గులాబ్జాన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలే జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-పీలేరు

మహిళలపై జరిగే దురాచారాల నిర్మూలన కోసం పోరాడిన క్రాంతి జ్యోతి సావిత్రిబాయిపూలే అని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని సోమవారం పీలేరులోని బాస్ ఆఫీసులో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కార్యవర్గ సభ్యులు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అన్నమయ్య జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు బాస్ నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుస్మృతి అమలు చేసిన దుర్మార్గపు చట్టాలను మంటలకు ఆహుతి చేసిన క్రాంతి జ్యోతి, భారత మహిళా తొలి ఉపాధ్యాయిని పూలే అని కొనియాడారు.ఆమె బాల్య వివాహాలు, సతీసహగమనం, అంటరానితనం వంటి దురాచారాల నిర్మూలనకు విరోచిత పోరాటం సాగించారని అన్నారు. వితంతువుల పునర్వివాహానికై తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి పోరాడారని గుర్తు చేశారు. 1848లో పూణేలో బాలికల కోసం తొలి పాఠశాలను ఏర్పాటుచేసి, ఆ పాఠశాలకు భారతదేశంలోనే తొలి ఉపాధ్యాయులుగా పని చేశారని అన్నారు. జ్యోతిరావు పూలే-సావిత్రిబాయి పూలే దంపతులు శూద్రుల కోసం, మహిళల కోసం అనేక పాఠశాలలు స్థాపించి బహుజన వర్గాల్లో వెలుగులు నింపి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. రైతులు, కార్మికుల మహిళా హక్కుల కోసం అన్ని రంగాల్లో సమానత్వం కోసం సమరం చేశారని అన్నారు. తెలియజేశారు. సావిత్రిబాయి పూలే జీవిత పోరాటాలు, త్యాగాలను నేటి సమాజానికి తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య, హరినాథ, ముల్లంగి గురవయ్య, హరీష్, కిషోర్, వీరయ్య పాల్గొన్నారు. **పుల్లంపేట :** దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేకి దలవాయి పల్లె ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. వారు పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అప్పట్లో దళిత బలహీన వర్గ మహిళల విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున,ఈశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్త్రీ విద్య కొరకు పోరాటం చేసిన సంఘసంస్కర్త, మాతా సావిత్రిబాయి పూలే అని బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్ అన్నారు. సావిత్రిభాయి పూలే వర్ధంతిని కాలనీ గేట్ న్యూ అంబేద్కర్ సర్కిల్, భారతీయ అంబేద్కర్ సేన కార్యాలయం నందు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల మోహన్, కోశాధికారి నీరుగట్టు రమణ, చాట్ల బయన్న లు మాట్లాడుతూ పీడిత ప్రజలు, స్త్రీ విద్య కొరకు సావిత్రిబాయి పూలే నిరంతరం పోరాటం చేశారన్నారు. ఆధునిక విద్య ద్వారా స్త్రీ విముక్తి సాధ్యమైతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలిసి పూణే నగరంలో తొలి పాఠశాలను నిర్మించిందన్నారు. కార్యక్రమంలో బాస్ నేతలు తలారి కృష్ణ, సోనికంటి రెడ్డప్ప, గంగాధర్, తెట్టు శ్రీనివాసులు, క్రాంతి, వలసపల్లి వెంకటరమణ, రెడ్డి ప్రసాద్, రాజేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

పీలేరు : సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బాస్ నాయకులు

'మిట్స్'లో జాతీయ ఐపి యాత్ర

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరెస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె

జాతీయ ఐపి యాత్ర-2025 పోస్టర్ ను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో మేథో సంపత్తి (ఐపి) ఆవిష్కరణ భవిష్యత్తును ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి అవరమైన రెండు రోజుల వర్క్‌షాప్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో కరెస్పాండెంట్ చేతుల మీదుగా ఈవెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. లోని మేధో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్ (ఐపిఎఫ్ సి) వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు తెలిపారు. ఈ నెల 21, 22, తేదీలలో కళాశాల ప్రాంగణం లో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలను రక్షించడం, సూక్ష్మ, చిన, మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్ భౌగోళిక సూచికలు, ట్రేడ్‌మార్క్‌లు, కాపీరైట్, పేటెంట్ లతో సహా మేధో సంపత్తి హక్కుల యొక్క కీలకమైన అంశాలను ఇందులో నిపుణులు వివరిస్తారని అన్నారు. ఉపయోగించుకోవడానికి అవసరమైన జ్ఞానం మరియు సాధనాలతో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడం ఈ జాతీయ ఐపీ యాత్ర 2025 లక్ష్యమని అన్నారు. ఇతర వివరాలకు 9848360295, 8712655132 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్.ద్వారకనాథ్, ప్రెసిడెంట్, ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ అకాడమీ, అడ్వైసర్ ఆర్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ ఆర్‌డి డాక్టర్ శివయ్య పాల్గొన్నారు.

కష్ట పడితేనే ఫలితం : ఎంఇఒ

ప్రజాశక్తి-కలికిరి

కష్టపడి పని చేయడానికి మించిన ప్రత్యామ్నయం లేదని ఎంఇఒ కరీముల్లా విద్యార్థులకు సూచించారు. సోమవారం ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం 10వ తరగతి వీడ్కోలు సమావేశం కరస్పాండెంట్ జి.సుజాత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ కరిముల్లా, జ్యోతిరావు పూలే ప్రిన్సిపల్ సోమశేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్ వై.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అని వివేకానందుని సూక్తిని పాటించి శ్రమించాలన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ కష్టపడి పనిచేయటానికి మించిన ప్రత్యాన్మాయం లేదన్నారు. సోమశేఖర్ ప్రిన్సిపల్ పిల్లలు క్రమశిక్షణ దృఢ సంకల్పంతో లక్ష్యాన్ని సాధించాలన్నారు. కరస్పాండెంట్ సుజాత వంద ఫలితాలు సాధిస్తూ 590 మార్కులు సాధిస్తే గొప్ప బహుమతి ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షాహిన, నాగజ్యోతి, అమీర్, అనూష విహాతో పాటు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు సోమవారం యువత పోరుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైసిపి కార్యాలయంలో ఉదయం 7 గంటలకు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి, అనంతరం యువకులు మహిళలు, విద్యార్థులు అందరూ కలిసి రాయచోటి కలెక్టర్ కార్యాలయం లో జరగబోయే యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు శివారెడ్డి, రైల్వే బోర్డ్ మెంబెర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి,శివయ్య,పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక వైసిపి కార్యాలయంలో యువత పోరు కార్యక్రమ గోడ పత్రికలను పార్టీ నాయకులతో వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ ఆవిష్కరించారు. 12న విద్యార్థుల పక్షానా నిలబడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్నట్లు తెలిపారు. 5 త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్ఎ.కరీముల్లా, కౌన్సిలర్లు పాల్‌చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, నరి బాబాయ్, మహిళా నాయకురాలు బీరంగి రేవతి, శారదారెడ్డి, మేరీ, నాయకులు గువ్వల నాగరాజురెడ్డి, వి.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన పీలేరు విద్యార్థి

ప్రజాశక్తి-పీలేరు

జాతీయస్థాయి-2025 కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పీలేరు యోధ కరాటే ఇన్స్టిట్యూట్ విద్యార్థి ప్రతిభ చూపా డని నిర్వాహకులు తెలిపారు. తిరుపతి జిల్లా, రేణిగుంట రైల్వే ఇన్సి ట్యూట్‌లో ఎన్ఎస్ఎఐ ఈ పోటీలను నిర్వహించిందని అన్నారు. అండర్-14 విభాగంలో జరిగిన ఈ కరాటే పోటీల్లో పీలేరు యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన జి. రామ్మోహన్ కుమార్తె జి.గీతశ్రీ కటా అండ్ కుమ్మితే ఫైట్‌లో పాల్గొని కుమ్మి తేలో మొదటి స్థానాన్ని, కటాలో మూడవ స్థానాన్ని సాధించినట్లు తెలి పారు. ఈ పోటీలలో 300 మంది విద్యార్థుల పాల్గొన్నారు. కటా అండ్ ఫైట్ చాలా కఠినంగా జరిగాయని కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్ తెలిపారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో శిక్షకులు

మాట్లాడుతున్న సిఐ కొండారెడ్డి

మత సామరస్యానికి ప్రతీక ఉరుసు

ప్రజాశక్తి-రామాపురం

ఈనెల 13,14,15తేదీలలో మండలంలోని నీలకంఠరావుపేట ఉరుసు మహోత్సవాన్ని మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు, సిఐ కొండారెడ్డి, ఎస్ఐ వెంకట్ సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని నీలకంఠరావుపేట దర్గా ప్రాంగణంలో సోమవారం హిందూ, ముస్లిం సోదరులతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరుసు మహోత్సవంలో హిందువులు ముస్లింలు మతసామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించరాదని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశానికి హిందూ, ముస్లిములు, ఉరుసు నిర్వాహకులు పాల్గొన్నారు.

విశ్రాంత విద్యాశాఖ అధికారికి డాక్టరేట్

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మండల విశ్రాంత విద్యాశాఖ అధికారిగా పనిచేసి, ప్రస్తుతం ఇండియన్ పబ్లిక్ హైస్కూల్ డైరెక్టర్‌గా ఉన్న వై.ఆదినారాయణరెడ్డికి బెంగుళూరు భారత్ వర్చువల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రభుత్వ విద్యాశాఖ అధికారిగా, ప్రైవేటు విద్యారంగానికి చేసిన సేవలకు, సామాజిక సేవలను గుర్తించి ఈ ఈ హోదాను కల్పించింది. శనివారం బెంగుళూరులోని హోటల్ ఎజె.ఇంటర్నేషనల్‌లో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు మదనపల్లి రఘునాథ్‌రెడ్డి, భాకరాపేట జనార్దన్‌రెడ్డికి, పుంగనూరు చంద్రమోహన్‌కు కూడా గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేయబడ్డాయి. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి తనకు ఇచ్చిన ఈ పురస్కారంతో బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. జీవితాంతం విద్యారంగంలోనే విద్యార్థులకు సేవలు అందిస్తానని తెలిపారు. ఆయనకు డాక్టరేట్ పురస్కారం అందుకున్న సందర్భంగా రెడ్డి జెఎసి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యాయ సంఘాలు, బంధువులు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

- 200 గ్రాముల బంగారంతో పాటు ఫొటో కెమెరా స్వాధీనం

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

జిల్లాలోని రైల్వేకోడూరులో 2024 సంవత్సరంలో వరుస చోరిలకు పాల్పడ్డ తిరుపతి జిల్లాకు చెందిన కచ్చిలేటి వెంకటేశ్వర్లును అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 17.50 లక్షలు విలువచేసే 200 గ్రాములు బంగారు నగలుతో పాటు ఓ ఫోటో కెమెరా ను రికవరీ చేసినట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ హెగ్డే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. నిందితుడు వెంకటేశ్వర్ల పై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలలో ఒక హత్య కేసు, ఒక హత్యాయత్నం కేసు, 17 చోరీ కేసులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నిందితుడు వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో గాయ పడి మంచం పైనుంచి కదలలేని పరిస్థితిలో ఉండడంవల్ల రిమాండ్‌కు తరలిం చలేని స్థితిలో 35(3) బిఎన్ఎస్ఎస్ యాక్ట్ కింద నోటీసులు అందించినట్లు తెలిపారు.

వివాహిత అత్యాచార ఘటనలో నిందితులు..

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సిఐ సత్యనారాయణ

మదనపల్లె అర్బన్ : వివాహిత పై గ్యాంగ్ రేప్ కేసులో నిందితులను సోమ వారం రూరల్ పోలీ సులు అరెస్టు చేశారు. సిఐ సత్యనారాయణ కథనం మేరకు.. నిమ్మ నపల్లి మండలం, తవళం పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన ఓ వివాహిత గత నెల 27న పాలు పోయడానికి వెళుతుండగా, సమీప గ్రామం నల్లమోళ్లపల్లెకు చెందిన నాగేంద్ర, సురేంద్ర అనే ఇద్దరు ఆమెను వెంబడించారన్నారు. కాపుకాచి, మార్గమధ్యంలో అటకాయించి చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి నోటిలో గుడ్డలు కుక్కి అరవకుండా చేసి, ఒకరి తర్వాత ఒకరు ఆ వివాహితపై అత్యా చారం చేశారని వివరించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే నీ భర్తను చంపే స్తామని వివాహితను బెదిరించడంతోఆమె ఐదు రోజులపాటు ఎవరికి చెప్ప కుండా మనసులోని కుమిలిపోయిందని అన్నారు. ఆవేదన తట్టుకోలేక ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిమ్మనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి గ్యాంగ్ రేప్ కేసులో నిందితులైన నాగేంద్ర, సురేంద్ర లను అరెస్టు చేసినట్లు తెలిపారు. సాంకేతిక సాక్షాధారాలతో కోర్టులో హాజరు పర్చగా కోర్టు నిందితులకు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పుత్తనవారిపల్లి చెక్ పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి ఓబులవారిపల్లి మండలం అయ్యల రాజుపల్లి గ్రామానికి చెందిన గౌరీ అనే వ్యక్తి ఆకుల లారీ టాప్ పైకి ఎక్కుతున్న సమయంలో జారి లారీ కింద పడి రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అవ్వడం జరిగింది. స్థానిక పోలీసుల 108 వాహనంలో రాజంపేటకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ సమస్యలతో హమాలీ ఆత్మహత్య

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో హమాలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లి పట్టణంలో జరిగింది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నీరుగట్టువారిపల్లి, గజ్జలకుంట ప్రాంతానికి చెందిన రాజేష్ అలియాస్ రాజి (40) స్థానికంగా ఉన్న టమోటా మార్కెట్లో హమాలీగా పని చేస్తున్నాడు. రోజు మద్యం తాగి రావడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య గొడవ పడింది. భర్తపై అలిగి అదే వీధిలోని పక్కింటికి వెళ్లిపోయింది. రాత్రంతా భార్య ఇంటికి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాజేష్ ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.